క్లుప్తంగా

మామిడి తోటకు నిప్పు


కాలిపోయిన మామిడి చెట్లు

మడకశిరరూరల్: మండల పరిధిలోని పాపసానిపల్లికి చెందిన రైతు జగన్నాథ్‌రెడ్డి సాగు చేసిన మామిడి తోటకు మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో కాయలు ఉన్న మామిడి చెట్లు మంటల్లో కాలిపోయి దాదాపు రూ.లక్ష వరకు నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయారు. జరిగిన నష్టాన్ని అధికారులు అంచనా వేసి పరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

అగళి: కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. మండల పరిధిలోని ఇరిగేపల్లి గ్రామం వద్ద సువర్ణముఖి వంక నుంచి అక్రమంగా ఇసుకను పీ బ్యాడగేర గ్రామం సమీపంలోని కర్ణాటక బోర్డర్‌కు తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్‌ఐ వీరేష్ సిబ్బందితో దాడులు చేశారు. ట్రాక్టర్ యాజమని అగళి గ్రామానికి చెందిన భూతేష్‌పై కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో వీఆర్‌ఏ మృతి


అశ్వత్థప్ప (ఫైల్)

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రొళ్ల రెవెన్యూ గ్రామ రెవెన్యూ సహాయకుడు (వీఆర్‌ఏ)గా పని చేస్తున్న అశ్వత్థప్ప (55) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక తహసీల్దార్ షేక్షావలి, ఆర్‌ఐ గిరియప్పతో పాటు సిబ్బంది మంగళవారం మృతుని ఇంటివద్దకు వెళ్లి అశ్వత్థప్ప భౌతికకాయం వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అశ్వత్థప్పకు భార్య సరోజమ్మతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వివాదాస్పద భూమి రికార్డుల పరిశీలన


తహసీల్దార్ శ్రీధర్‌కు సమస్యను వివరిస్తున్న దళితులు

పెనుకొండ రూరల్: మండలంలోని దుద్దేబండ పంచాయతీ సర్వే నంబర్ 454లోని 50 ఎకరాలా 60 సెంట్ల భూమి కొంతకాలంగా వివాదంలో ఉంది. గ్రామానికి చెందిన దళితులు, కొందరు రియల్టర్ల మధ్య వివాదం నెలకొనడంతో తహసీల్దార్ శ్రీధర్ మంగళవారం ఆ గ్రామాన్ని సందర్శించారు. ఇరువర్గాల వాదనలను విన్న తహసీల్దార్ భూ రికార్డులను పరిశీలించారు. వచ్చే నెల 9న సర్వేచేసి ఫీల్డ్ వెరిఫికేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా హావనూరు జయంతి

పావగడ: కర్ణాటకలో వాల్మీకులను ఎస్టీ రిజర్వేషన్ జాబితాలో చేర్పించి వారి అభ్యున్నతికి పాటు పడిన వాల్మీకి సంఘం నేత, మాజీ మంత్రి, కర్ణాటక వెనుకబడిన వర్గాల కమిటీ అధ్యక్షుడు దివంగత ఎల్‌జీ హావనూరు 100వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మహర్షి వాల్మీకి దేవాలయంలో మంగళవారం వాల్మీకి చిత్రపటం వద్ద పూజలు చేశారు. నిడుగల్ మహాసంస్థాన వాల్మీకి ఆశ్రమాధిపతి వాల్మీకి సంజయ స్వామీజీ, వాల్మీకి జాగృతి వేదిక అధ్యక్షుడు లోకేశ్ పాళేగార్, మహిళా విభాగం అధ్యక్షురాలు అంబికా రమేశ్, ఓంకార నాయక తదితరులు పాల్గొన్నారు.

సీఐగా నాగేష్‌బాబు బాధ్యతల స్వీకరణ



మడకశిర: మడకశిర అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా నాగేష్‌బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు సీఐగా ఉన్న రాగిరి రామయ్య మహిళతో అసభ్యకరప్రవర్తన కారణంగా సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. నూతన సీఐగా నాగేష్‌బాబు మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడేందుకు, అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు.

29లోపు ఈకేవైసీ పూర్తి చేయండి

అమరాపురం: మండలంలోని ప్రభుత్వ చౌక ధాన్యపు డీలర్లు ఈ నెల 29 లోపు తమ పరిధిలోని రేషన్‌కార్డు లబ్ధిదారుల ఈకేవైసీ నమోదును పూర్తి చేయాలని సీఎస్‌డీటీ నవీన్ ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

రేషన్ కార్డుదారులకు.. ఈ-కేవైసీ టెన్షన్



రేషన్‌కార్డుదారులకు ఈ-కేవైసీ టెన్షన్ పట్టుకుంది. ఈనెల 29లోగా కార్డుదారులు ఈ-కేవైసీ చేసుకోకపోతే రేషన్‌కట్ చేస్తారని చెబుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఇది కచ్చితంగా కార్డులను తొలగించే కుట్రేనని విమర్శిస్తున్నారు.

- ఈనెల 29లోపు ఈ-కేవైసీ చేసుకోకపోతే రేషన్ కట్ చేస్తామంటున్న ప్రభుత్వం
- ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు
- కార్డులు తొలగించే కుట్రేనని ప్రజల ఆగ్రహం

మడకశిర: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులను ఈ-కేవైసీ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోఈ-కేవైసీ లేకుండానే కార్డుల్లోని లబ్ధిదారులకందరికీ బియ్యం అందించారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ-కేవైసీ చేయించుకుంటేనే బియ్యం అందిస్తామని, లేకపోతే బియ్యం కట్ చేస్తామని హుకుం జారీ చేయడంతో పేదలు అవస్థలు పడుతున్నారు.

సరుకులను కట్ చేసేందుకే..

ఇంటి యజమాని ఒకరు ఈ-కేవైసీ చేయించుకుంటే సరిపోయేదని, అయితే ప్రభుత్వం రేషన్‌కార్డుల్లో ఉన్న సభ్యులందరూ (5 సంవత్సరాల పిల్లలు మినహా) తప్పని సరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని నిబంధన పెట్టడంతో సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పేదలకందే నిత్యావసర సరుకులను కట్ చేయడానికే కుట్ర పన్నిందని పలువురు విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా చాలా మంది అనేక కారణాలతో ఈ-కేవైసీ చేయించుకోవడానికి సాధ్యం కావడం లేదు. వీరందరినీ రేషన్ కార్డుల నుంచి తొలగించనున్నారు. నిత్యావసర సరుకులను కూడా అందించకుండా నిలిపి వేస్తారు. ఈ-కేవైసీ చేయించుకోని లబ్ధిదారులు కొత్త కార్డులు పొందడానికి కూడా అర్హత కోల్పోతారు. దీంతో ప్రభుత్వం ఈ-కేవైసీ పేరుతో సరుకుల పంపిణీని నిలిపివేయకుండా అందించాలని కోరుతున్నారు.

ఇతర ప్రాంతాల్లో ఉన్న వారికి ఇక్కట్లు

రేషన్ కార్డుల్లో సభ్యులుగా ఉన్న చాలా మంది ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారు. రేషన్‌కార్డుదారుల పిల్లలు చదువుకోవడానికి బెంగళూరు, విజయవాడ, అనంతపురం, తిరుపతితో పాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి ఈ-కేవైసీ చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో విద్యార్థులు దూరప్రాంతాల నుండి తమ గ్రామాలకు వచ్చి ఈ-కేవైసీ చేయించుకోవడం చాలా కష్టంగా మారింది. అలాగే విద్యార్థులపై ఆర్థికభారం కూడా పడుతుంది. దీంతో లబ్ధిదారులు కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముంచుకొస్తున్న డెడ్‌లైన్

కూటమి ప్రభుత్వం ఈ-కేవైసీ చేయించుకోవడానికి డెడ్‌లైన్ విధించింది. ఈనెల 29 వరకూ అవకాశం కల్పించింది. ఇదే చివరి అవకాశమని రేషన్ కార్డుల లబ్ధిదారులకు తెలిపింది. ఈనెల 29 లోగా ఈ-కేవైసీ చేయించుకోకపోతే సదరు సభ్యుడికి నిత్యావసర సరుకులు అందే పరిస్థితి లేదు.

నియోజకవర్గంలోని రేషన్‌కార్డుదారుల వివరాలు..

మండలం	లబ్ధిదారుల సంఖ్య	ఈ-కేవైసీ చేసుకున్నవారు
మడకశిర	76,714	69,408
గుడిబండ	52,134	47,863
అమరాపురం	56,931	52,364
అగళి	33,992	31,131
రొళ్ల	38,130	34,776
మొత్తం	2,57,901	2,35,542

సరుకులు కట్ చేయొద్దు



కూటమి ప్రభుత్వం ఈ-కేవైసీ పేరుతో నిత్యావసర సరుకులను కట్ చేయడానికి ప్రయత్నించడం అన్యాయం. వైఎస్ జగన్ హయాంలో ఇలాంటి నిబంధనలు పెట్టి పేదలకు అన్యాయం చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ-కేవైసీ పేరుతో పేదలను ఇబ్బందికి గురిచేయడం మంచిది కాదు. ఈకేవైసీ చేయించుకున్నా, చేయించుకోకపోయినా సరుకులు అందించాలి.

–చిత్తయ్య, జీజీ హట్టి, రొళ్ల మండలం

గతంలో ఇలాంటి ఇబ్బందులు లేవు



కొన్నేళ్ల నుంచి చౌకధాన్యపు డిపో నుంచి నిత్యావసర సరుకులు తీసుకుంటున్నాం. అయితే వైఎస్ జగన్ హయాంలో ఈ-కేవైసీ చేయించకపోయినా సరుకులను అందాయి.అయితే కూటమి ప్రభుత్వం పేదలను లేనిపోని నిబంధనలతో ఇబ్బంది పెట్టడం మానుకోవాలి. రేషన్‌కార్డుల్లో ఉన్న సభ్యులందరికీ సరుకులను అందించి ఆదుకోవాలి.

– కదురుప్ప, ఫణారం, గుడిబండ మండలం

వెంటనే ఈ-కేవైసీ చేయించుకోవాలి



రేషన్ కార్డుల్లో సభ్యులుగా ఉన్న వారందరూ ఈనెల 29 లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలి. లేకపోతే రేషన్ కోల్పోయే ప్రమాదం ఉంది. పూర్తిస్థాయిలో ఈ-కేవైసీ చేయించడానికి ముమ్మరంగా ప్రయత్నం చేస్తున్నాం. డీలర్లకు బాధ్యత అప్పగించాం. లబ్ధిదారులు కూడా ఎక్కడ ఉన్నా సరే గ్రామాలకు వచ్చి ఈ-కేవైసీ చేయించుకోవాలి.

–లక్ష్మీనరసింహ, ఇన్‌చార్జ్ తహసీల్దార్, అమరాపురం



బాధిత కుటుంబానికి పరామర్శ


జయమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఉషశ్రీచరణ్

రొద్దం: మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రామిరెడ్డి తల్లి జయమ్మ (65) గుండెపోటుతో మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ గ్రామానికి చేరుకుని మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట మండల కన్వీనర్ తిమ్మయ్య, చోళేమర్రి ఎంపీటీసీ సదాశివ రెడ్డి తదితరులు ఉన్నారు.

వంద రోజుల పని కల్పించాలి

రొళ్ల: ఏప్రిల్ 1వ తేదీ నుంచి జాబ్ కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి ఉపాధి ద్వారా వంద రోజుల పని దినాలు కల్పించాలని ఎంపీడీఓ రామరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించిన పలు సూచనలు చేశారు.

రీ సర్వేపై అవగాహన

అగళి: మండల పరిధిలోని మధూడి గ్రామంలో తహసీల్దార్ సుబ్బారావు ఆధ్వర్యంలో భూ రీసర్వేపై గ్రామసభ, అవగాహన ర్యాలీ నిర్వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ.. రైతులు రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

కూలీల సంఖ్య పెంచండి

గుడిబండ: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఉపాధి ద్వారా కూలీలకు పనులు కల్పించి కూలీల శాతాన్ని పెంచడానికి సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఏపీడీ లక్ష్మీనారాయణ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గంగాధర్‌తో కలిసి ఉపాధి సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు.

శివాపురం కాలనీలో చోరీ

మడకశిర: పట్టణంలోని 8వవార్డు శివాపురం కాలనీలోని మహేష్ ఇంట్లో సోమవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. తన భార్య వైద్య చికిత్స నిమిత్తం మహేష్ ఇంటికి తాళం వేసి బెంగళూరు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు భావిస్తున్నారు. ట్రైనీ డీఎస్పీ ఉదయ పావని, ఏఎస్‌ఐ ముత్యాలప్ప ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మడకశిరలో ఎలుగుబంట్ల సంచారం

మడకశిర: పట్టణంలో ఎలుగుబంట్లు సంచరిస్తున్నట్లు తెలియడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా పట్టణ శివారు ప్రాంతంలోని అమరాపురం రోడ్డులోని గాంధీనగర్‌లో సోమవారం రాత్రి ఎలుగుబంట్లు సంచరించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పట్టణ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుని ఎలుగుబంట్ల నుంచి రక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఎర్ర బ్యాడ్జీలతో నిరసన

మడకశిర: మడకశిర ఆర్టీసీ డిపోలో మంగళవారం కూడా ఆర్టీసీ కార్మికులు నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు ఎర్ర బ్యాడ్జీలను ధరించి విధులకు హాజరయ్యారు. డిపోలోని సమస్యలను పరిష్కరించాలని, కార్మికులపై అక్రమ సస్పెన్షన్లను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. ఎన్ఎంయూ నాయకులు రామకృష్ణ, జయసింహ, ముద్దప్ప, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

వేలంతో చిలమత్తూరు పంచాయతీకి ఆదాయం

చిలమత్తూరు: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన వేలం పాట ద్వారా పంచాయతీకి రూ.13,71,900 ఆదాయం వచ్చినట్లు ఈఓఆర్డీ ప్రభుదాస్ పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన వారపు సంత వేలంపాట ద్వారా రూ.3.38 లక్షలు, బస్టాండ్ ఫీజు వసూలుకు రూ.76 వేలు, షాపింగ్ కాంప్లెక్స్‌ల ద్వారా రూ.9.57 లక్షలు మొత్తం రూ.13.71 లక్షలు పంచాయతీకి ఆదాయం వచ్చిందన్నారు.

లైంగిక నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మి

హిందూపురం అర్బన్: లైంగిక నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మి సూచించారు. ప్రధానంగా ఆడపిల్లల విషయంలో తల్లులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 'లైంగిక వేధింపులు – బాల్య వివాహాల నిరోధం'పై న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ప్రధానంగా మంచి , చెడు స్పర్శలపై ఆడపిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. లైంగిక వేధింపుల విషయంలో దాపరికానికి తావులేకుండా పిల్లలు తెలియజేసే విధంగా చూడాలన్నారు. అలాగే 18 ఏళ్ల లోపు అమ్మాయిలకు వివాహాలు చేస్తే చట్టరీత్యా కఠిన శిక్షతో పాటు జైలు శిక్ష కూడా విధిస్తారని హెచ్చరించారు. మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. సమస్యలు వచ్చినప్పుడు మహిళలు కృంగి పోకుండా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు మాట్లాడుతూ లైంగిక వేధింపులు, బాల్య వివాహాలపై మహిళలకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి సదస్సులు దోహదం చేస్తాయన్నారు. వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీధర్ మాట్లాడుతూ మహిళలకు ఇబ్బందులు తలెత్తితే 100 నంబరుకు కాల్ చేస్తే క్షణాల్లో ఆ ప్రాంతానికి చేరుకొని సహాయం చేస్తామన్నారు. మున్సిపల్ ఆడిట్ అధికారి శోభన్‌రెడ్డి, న్యాయవాదులు రవిచంద్ర, మురళీ, ఉదయ్‌సింహారెడ్డి, ఈశ్వరప్ప, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బకాయి చెల్లిస్తే వడ్డీ రాయితీ

చిలమత్తూరు/మడకశిర/పెనుకొండ: హిందూపురం, మడకశిర మున్సిపాలిటీ, పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయి ఉన్న ఆస్తి, ఖాళీ ఇంటి స్థలాల పన్నులకు ఈ నెల 31లోగా ఒకేసారి చెల్లించి 50 శాతం వడ్డీ రాయితీ పొందవచ్చని కమిషనర్లు శ్రీనివాసులు, రంగస్వామి, సతీష్‌కుమార్ తెలిపారు. ఇప్పటికే పన్ను బకాయిలు లేకుండా చెల్లించి వడ్డీ కట్టిన వారికి కూడా ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ వడ్డీ రాయితీని వచ్చే ఆర్థిక సంవత్సరంలో పన్నులకు జమ చేస్తామన్నారు.

వివాహిత బలవన్మరణం

పెనుకొండ రూరల్: కడుపు నొప్పి తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం కురుబవాండ్లపల్లికి చెందిన గంగరత్న (47)కు భర్త రామాంజినేయులు, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆమె మంగళవారం నొప్పి తీవ్రత తాళలేక విషపూరిత ద్రావకం తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను పెనుకొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని జీజీహెచ్‌కు రెఫర్ చేశారు. చికిత్సకు స్పందించక జీజీహెచ్‌లో ఆమె మృతి చెందింది. ఘటనపై కియా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

27 బహిరంగ వేలం

చిలమత్తూరు: హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని దినసరి కూరగాయల మార్కెట్ వద్ద రోడ్డు మార్జిన్‌పై అమ్ముకొనే వస్తువులపై రుసుం వసూలు చేసుకునేందుకు , పెద్ద పశువులు, తోళ్ల మార్కెట్‌లో సుంకం వసూలు చేసుకొనే హక్కులను పొందేందుకు ఈ నెల 27న బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో వారపు సంతలో సుంకం వసూలుకు సంబంధించిన వేలం పాట ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ గంగాదేవి, కార్యదర్శి రామాంజినేయులు ఓ ప్రకటనలో తెలిపారు. రూ.5 లక్షలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. అలాగే పంచాయతీ కాంప్లెక్స్, దిన సంతకు సంబంధించి వేలం పాట కొనసాగుతుందన్నారు.

కూటమికి ఓటేసి తప్పు చేశాం

- మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ముందు ప్రజల ఆవేదన


పార్టీ శ్రేణులతో కలిసి కాఫీ తాగుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

పరిగి: 'ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎం చంద్రబాబుతో పాటు కూటమి నాయకులు సూపర్ సిక్స్ హామీలంటూ నమ్మించి మోసం చేశారు. వారికి ఓటేసి తప్పు చేశాం' అని తిరుమలదేవరపల్లి గ్రామస్తులు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తిరుమలదేవరపల్లిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి గడపకూ వెళ్లి ప్రజల సాదకబాధకాలను తెలుసుకున్నారు. మహిళలు, రైతులు, విద్యార్థులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి యేటా జగనన్న తమను ఆర్థికంగా, సామాజికంగా రాణించేందుకు సహాయ సహకారాలను అందించారన్నారు. నేడు కూటమి సర్కార్ ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు.

భర్త చనిపోయినా పింఛన్ రాలేదమ్మా...

తన భర్త చనిపోయి ఏడాది కాలమైనా నేటికీ వృద్ధాప్య, వితంతు పింఛన్ మంజూరు కాలేదని తిరుమలదేవరపల్లికి చెందిన గంగమ్మ అనే వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్తకు జగనన్న పింఛన్ మంజూరు చేశారని , అయితే భర్త మరణాంతరం కార్యాలయాల చుట్టూ తిరిగినా నేటికీ ప్రయోజనం లేదని ఉషశ్రీచరణ్ వద్ద వాపోయింది. మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ కూటమి నాయకులు అన్ని విధాలా ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని, మంత్రులు, ఎమ్మెల్యేల ప్రమేయంతో రాష్ట్రం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, సర్పంచ్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంగపూజలో పాల్గొన్న మాజీ మంత్రి

పెనుకొండ రూరల్: మండలంలోని మావటూరు పంచాయతీ గ్రామంలోని సుద్దబట్లపల్లిలో గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి సొంత నిధులతో బోరు వేయించారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ నూతన మోటారును ప్రారంభించి గంగ పూజ చేశారు. సర్పంచ్ నాగరాజు, ఎంపీటీసీ శివయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ


అగళి: మాట్లాడుతున్న సీడీపీఓ నాగమల్లేశ్వరి

మడకశిర: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం కూడా శిక్షణ తరగతులు కొనసాగాయి. స్థానిక సీడీపీఓ నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో పోషణ్ బీ–పడాయి బీ కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. చిన్నారుల విద్యాభివృద్ధి, ఆరోగ్యాభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాల పై శిక్షణ ఇచ్చారు.

అగళి: పిల్లల్లో అభ్యసనా సామర్థ్యాన్ని గుర్తించి, సృజనాత్మకతను పెంపొందించుకునే దిశగా కృషి చేయాలని సీడీపీఓ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ పడాయి బీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ లీలవతి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రొళ్ల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశం మందిరంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రెండో రోజు అంగన్‌వాడీ వర్కర్లలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సెంటర్‌లో అందజేసే పౌష్టికాహారాలతో పాటు సహజంగా లభించే ఆహారం తీసుకోవడం ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ నాగమల్లేశ్వరి తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సన్నమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కరగ మహోత్సవం


కరగ పల్లకీతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) అలంకరణలో గంగమ్మదేవి

హిందూపురం: పట్టణంలోని సురప్పకట్ట వద్ద ఉన్న బోయకొండ గంగమ్మ ఆలయంలో కరగ మహోత్సవాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పూజారి మోహన్‌బాల అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు, మహిళలు జ్యోతులతో తరలివచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం కాళికాదేవికి కుంభపూజ, అన్నసంతర్పణ చేశారు. రాత్రి గంగమ్మకు కరగ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కరగ పల్లకీని ఎత్తుకుని మంగళవాయిద్యాలు, డప్పుల వాయిద్యాలతో ఊరేగింపు సాగింది. భక్తులు గుండం చుట్టూ ప్రదక్షిణాలు చేశారు.

వడదెబ్బ తగలకుండా చర్యలు

రొళ్ల: వేసవి దృష్ట్యా విద్యార్థులు వడ దెబ్బకు గురయ్యే అవకాశం ఉందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈఓ శ్రీధర్ సూచించారు. మంగళవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఎంఈఓ శ్రీధర్ మాట్లాడుతూ వాటర్ బెల్ సక్రమంగా కొట్టించి నీటిని తాగే విధంగా చూడాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పునఃప్రారంభం


చిన్నారులకు మిఠాయిలు, ఆటవస్తువులు పంపిణీ చేస్తున్న మధుమతిరెడ్డి

హిందూపురం: అంగన్‌వాడీ ద్వారా అందే సేవలు సద్వినియోగం చేసుకుని చిన్నారులు విద్య, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పలువురు వక్తలు అన్నారు. హిందూపురం మండలం చౌళూరులో అధ్వాన దశలో ఉన్నా అంగన్‌వాడీ కేంద్రంలో సూర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేంద్రాన్ని పూర్తిస్థాయిలో సుందరీకరణ చేశారు. కేంద్రం పునఃప్రారంభం సందర్భంగా వందమంది రైతులకు కూరగాయల విత్తనాలు, చిన్నచేలుకలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి, మండల్ హార్టికల్చర్ అధికారి మహేష్ నాయక్, సర్పంచ్ నంజప్ప, సూర్య కంపెనీ సీఈఓ మాణిక్ పాటిల్, హెచ్‌ఆర్ హెడ్ గ్యాంన్ ప్రకాష్ అగర్వాల్, జోన్ ఇన్‌చార్జ్ శత్రుఘన్ కష్యాప్ తదితరులు పాల్గొన్నారు.